

గ్రూప్-సి ఉద్యోగాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - విజయనగరం కోట

గ్రూప్-సి ఉద్యోగాలకు యువత దరఖాస్తు చేసుకోవాలని సెట్విజ్ సిఇఒ బి.రామగోపాల్ కోరారు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నుంచి కంబైన్డ్ హయ్యర్ సెకండరీ (10+2) లెవెల్ ఎగ్జామినేషన్ 2023 గ్రూప్ 'సి' లోయర్ డివిజినల్ క్లర్క్ / జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ అండ్ డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాల నియామకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. వివిధ శాఖల్లో లోయర్ డివిజనల్ క్లర్క్, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టులకు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పోటీ పరీక్షను నిర్వహిస్తుందని తెలిపారు. దేశంలోని అన్ని ప్రాంతాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని వయోపరిమితి, అవసరమైన విద్యార్హతలు, చెల్లించాల్సిన రుసుము, పరీక్ష విధానం గురించి ssc.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు. ఈనెల 10లోగా ఫీజు చెల్లించాలని, ఆగస్టులో పరీక్ష ఉంటుందని తెలిపారు.



ఎస్.కోటలోని మహిళా మార్టు

వైఎస్ఆర్ క్రాంతి పథం అధికారుల తీరు గ్రామైక్య సంఘాల అభివృద్ధి కంటే పతనానికే దారి తీసేలా ఉంది. చేయూత మహిళా మార్టు పేరుతో మహిళా సంఘాల సభ్యులను వేధింపులకు గురి చేస్తున్నారని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్వాక్రా మహిళల నుంచి డబ్బులు వసూలు చేసి మహిళా మార్టులు నిర్మించడమే కాకుండా ఇప్పుడు అదే మార్టులో సరుకులు కొనుగోలు చేయకపోతే ఆసరా డబ్బులు ఇవ్వబోమని మెలిక పెడుతున్నారు. రుణం కావాలన్నా కచ్చితంగా మహిళా మార్టులో సరుకులు కొనాల్సిందేనని షరతు విధిస్తున్నారు. దీంతో మహిళలు ఆందోళన చెందుతున్నారు. అవసరం లేకపోయినా సరుకులు ఎలా కొంటామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మార్టులో కొంటేనే మాఫీ!

- మహిళా సంఘాల సొమ్ముతో చేయూత మార్టు ఏర్పాటు
- రూ.300 సరుకులు కొనుగోలు చేస్తేనే 'ఆసరా'
- రూ.1000 సామాన్లు కొంటేనే రుణం మంజూరు
- అధికారుల ఆదేశాలతో మహిళల ఆందోళన

ప్రజాశక్తి -శృంగవరపుకోట

మండలంలో 1746 మహిళ సంఘాలు ఉండగా వీటిలో 19,821 మంది సంఘ సభ్యులున్నారు. వీరిలో ఒక్కొక్కరి నుంచి రూ.310 చొప్పున సుమారు రూ.38 లక్షలు గతేడాదే వసూలు చేశారు. ఈ మొత్తంతో తహశీల్దార్ కార్యాలయం దగ్గరలో భారతీయ స్టేట్ బ్యాంక్ పక్కన చేయూత మహిళా మార్టును ఏర్పాటు చేశారు. మార్టును విజయవంతంగా నడపాలని అధికారుల ఒత్తిడి చేయడంతో గ్రామైక్య సంఘం అధ్యక్షులు, విఒఎలు మహిళా సంఘసభ్యులను సరుకులు కొనుగోలు చేయాలని హుకుం జారీ చేశారు. అయినప్పటికీ ఎవరూ అక్కడ కొనుగోలు చేసేందుకు ఇష్టపడడం లేదు.

ఇంతలో వైఎస్ఆర్ ఆసరా కింద మూడో విడత మహిళా సంఘాల రుణ మాఫీని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రెండు నెలల క్రితం విడుదల చేశారు. ఆ డబ్బులు నేటికీ మహిళా సంఘాల ఖాతాల్లో జమ కాలేదు. ఇదే విషయాన్ని అవకాశంగా మలుచుకొని గ్రామైక్య సంఘ అధ్యక్షులు, విఒఎలు మహిళా సంఘాల ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు జమ కావాలంటే సంఘంలోని ఎంతమంది సభ్యులు ఉంటే అందరూ రూ.300 చొప్పున మహిళా మార్టులో సరుకులు కొనుగోలు చేయాలని షరతు విధించారు. సరుకులు కొనుగోలు చేసిన మహిళ సంఘంలోని సభ్యులకు మాత్రమే రుణమాఫీ డబ్బులు బ్యాంకు ఖాతాల్లో పడతాయని వేలిముద్రలను తీసుకున్నారు. సరుకులు వద్దంటే ఆసరా డబ్బులు పడవని బెదిరిస్తున్నారని మహిళలు ఆవేదన చెందుతున్నారు.

సంఘ సభ్యురాలిని ఫోన్లో బెదిరించిన విఒఎ

చేయూత మహిళ మార్టు వద్దకు వచ్చిన విలేకరుల ముందే ఒక విఒఎ మహిళా మార్టుకు వచ్చి 1000 రూపాయలు సామాన్లు కొనుగోలు చేయకపోతే నీకు రుణం మంజూరు కాదని బెదిరించారు.

ఎవరినీ బలవంతం చేయటం లేదు

పట్టణంలో ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్టులో సరుకులు కొనుగోలు చేయాలని ఎవరినీ బలవంతం చేయడం లేదు. ఎవరిష్ట ప్రకారం వారు కొనుగోలు చేయవచ్చును. ఈ మార్టులోనే కొనుగోలు చేయాలని ఎవరినైనా బలవంతం చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. అంతేకాకుండా చేయూత మహిళా మార్ట్ ఏర్పాటు చేసేందుకు మహిళల వద్ద నుండి తీసుకున్న రూ. 310 లకు గాను సంవత్సరం తర్వాత మార్ట్ లాభాలలో వారికి వాటాలు ఇస్తాం. మహిళా మార్ట్‌లో కొనుగోలు చేయాలని బలవంతం చేస్తే వైకెపి కార్యాలయంలో సమాచారం అందించండి.

సురేష్, ఎపిఎం, శృంగవరపుకోట మండలం.

మార్టులో సామాన్లు కొంటేనే రుణం మంజూరు



మా సంఘ సభ్యులు గతంలో తీసుకున్న రుణం తీరిపోయింది. మళ్లీ రుణం కావాలని కోరగా చేయూత మహిళా మార్టులో ఒక్కో సంఘ సభ్యురాలు వెయ్యి రూపాయలు సామాన్లు కొనుగోలు చేస్తేనే రుణం మంజూరు చేస్తామని అన్నారు. ఒక్కొక్కరం అంత డబ్బు పెట్టి సామాన్లు కొనలేమని ప్రాధేయపడ్డాం. అయినా నెల రోజులు తిరిగినా రుణం మంజూరు కాలేదు. దీంతో చేసేదేమీ లేక ఒక్కొక్కరం వెయ్యి రూపాయలు పెట్టి మహిళా మార్టులో సామాన్లను కొనుగోలు చేశాం. వెంటనే బ్యాంకు వాళ్లు కూడా రుణం మంజూరు చేశారు.

- పతివాడ పైడితల్లమ్మ, మహిళా సంఘ సభ్యురాలు, పెదఖండేపల్లి

ఏ వ్యాధి ఉన్నా ఫ్యామిలీ ఫిజీషియన్ వద్దకే

- షుగర్, బిపి ఉన్న వారిని గుర్తించి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి
- సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి
- వైద్యాధికారులతో కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం



సమావేశంలో మాట్లాడుతున్నకలెక్టర్ నాగలక్ష్మి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ నిర్వహిస్తున్నపుడు ఆ గ్రామం లో ఏ వ్యాధి ఉన్న వారైనా ఈ ఎఫ్‌పిసి కార్యక్రమానికే హాజరు కావాలని, వేరే ఆసుపత్రులకు వెళ్ల కూడదని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వచ్చిన ప్రతి ఒక్కరికీ బిపి, షుగర్, కాన్సర్ వంటి వ్యాధులు గుర్తించి వారి వివరాలను ఆయా యాప్ లలో అప్‌లోడ్ చేయాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియం లో డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావుతో కలసి వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

ముఖ్యంగా మాతా శిశు మరణాలు తగ్గాలని, 9 నెలల్లో ఒక్క సారైనా గర్భిణీలకు తప్పనిసరిగా మొత్తం బాడీ పరీక్షలు జరపాలని సూచించారు. గర్భిణీలకు, బాలింతలకు రెగ్యులర్ గా రక్త పరీక్షలు జరిపి అనీమియా రాకుండా తగు వైద్యం అందించాలని సూచించారు. పాఠశాలలను తనిఖీ చేసి కిషోర బాలలలో రక్త హీనత లేకుండా చూడాలన్నారు. ప్రతి 3 నెలలకు ఒక్క సారి తప్పనిసరిగా పాఠశాలలకు వైద్యులు వెళ్లాలని అన్నారు. వర్షా కాలం మొదలవుతున్నందున మలేరియా, డెంగీ వంటి సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో నీటి నమూనాలను తీసుకొని పరీక్షలు జరపాలని, ప్రజలకు శుద్ధమైన నీరు అందేలా చూడాలని అన్నారు. సుస్థిర అభివద్ధి సూచీలలో వైద్య శాఖ కు సంబంధిన సూచీలే ఎక్కువగా ఉన్నాయని, 2027 నాటికి శతశాతం సాధించాలనే లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొని పని చేయాలన్నారు. కంటి వెలుగులో భాగంగా అందరికీ కళ్లద్దాలు పంపిణీకి ఎఎన్ఎంల ద్వారా చర్యలు చేపట్టాలని అన్నారు. పిహెచ్‌సిల్లో నాడు-నేడు కింద చేపట్టిన మరమ్మత్తులు, నూతన భవనాల పనులు వేగంగా జరిగేలా చూడాలన్నారు. పనులు పూర్తయిన వాటికి బిల్లులను వెంటనే అప్‌లోడ్ చేయాలన్నారు. సమావేశం లో ఆరోగ్య శ్రీ కో ఆర్డినేటర్, జిల్లా అంధత్వ నివారణా అధికారి, మలేరియా అధికారి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండో పోటీలకు ఇద్దరు ఎంపిక





ప్రజాశక్తి-విజయనగరం టౌన్

38వ సీనియర్ జాతీయ టైక్వాండో పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈనెల 8 నుండి 11వ తేదీ వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో జరగబోయే జాతీయ తైక్వాండో పోటీలకు ఎం.గగన్ సాగర్ దొర, వై. భార్గవి మన రాష్ట్ర తరపున ఎంపిక య్యారు. వీరికి జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు గురాన అయ్యలు, సిహెచ్ వేణుగోపాల రావు వీరికి అభినందనలు తెలిపారు

స్వచ్ఛంద సంస్థల సహకారం ఉండాలి

డిప్యూటీ డిఎంహెచ్ఒ సూర్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం

ఎయిడ్స్ నియంత్రణలో స్వచ్ఛంద సంస్థల సహకారం ఉండాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.సూర్యనారాయణ అన్నారు. జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక యూత్ హాస్టల్‌లో మంగళవారం జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంపై సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో హెచ్ఐవి/ఎయిడ్స్ నియంత్రణకు అందరూ కృషి చేయాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం మేనేజర్ పి.బాలాజీ, సూపర్‌వైజర్ ఎన్. సాక్షి గోపాలరావు, క్షయ నివారణ సూపర్‌వైజర్ డి.నాగరాజు, ప్రోగ్రామ్ ఆఫీసర్ రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సిబిఎస్ఇలో నైపుణ్యాభివృద్ధి కోర్సులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ ఏడాది నుంచి సిబిఎస్ఇ వివిధ నైపుణ్యాభివృద్ధి కోర్సులు ప్రవేశపెట్టిందని కేంద్రియ విద్యాలయం ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసులు తెలిపారు. జి-20 కార్యక్రమాలలో భాగంగా మహారాష్ట్ర లోని పూణే నగరంలో జరగబోవు విద్యకు సంబంధించి వర్కింగ్ గ్రూప్ సమావేశం సందర్భంగా స్థానిక కేంద్రీయ విద్యాలయంలో మంగళవారం స్కిల్ కోర్సెస్, వాటి ప్రయోజనాలు అనే అంశంపై తల్లితండ్రులతో వర్చ్యువల్ చర్చ గోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్త బి.శివకుమార్ మాట్లాడుతూ సిబిఎస్ఇలో ఆరు నుండి ఎనిమిదో తరగతి వరకు 33 నూతన కోర్సులను, 9,10తరగతులకు 22 కోర్సులను,11,12 తరగతులకు 43 నైపుణ్యాభివృద్ధి కోర్సులను ప్రవేశ పెట్టిందని తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు ఒక ప్రత్యేకమైన నైపుణ్యాభివృద్ధి కూడా కలిగి జీవితంలో ఎంతో ఉపయోగ పడుతుందని తెలిపారు.

అనుమతుల్లేని వాటర్‌ప్లాంట్‌ను మూయాల్సిందే

- ప్రజాసంఘాల ఆధ్వర్యాన ధర్నా
- నోటీసు ఇచ్చి ప్లాంట్‌కు తాళం వేసిన కార్పొరేషన్ అధికారులు
- ఓపెన్ చేస్తే కేసులు పెడతాం : సిఐ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని అయ్యప్పనగరలో ఏర్పాటు చేసిన అక్రమ వాటర్ ప్లాంట్‌ను రద్దు చేయాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం, పలు ప్రజాసంఘాల నాయకులు, అయ్యప్ప నగర్ కాలనీ వాసులు మంగళవారం వాటర్ ప్లాంట్ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు, అయ్యప్ప నగర్ కాలనీ అసోసియేషన్ నాయకులు యుఎస్ రవికుమార్ మాట్లాడారు. 2014 సంవత్సరం నుంచి ఇక్కడ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేసి ఈ ప్రాంత వాసులకు నీరు లేకుండా చేస్తున్నారన్నారు. పెద్ద మోటార్లు పెట్టి నీటిని తోడేయడం వలన భూ గర్భ జలాలు ఇంకిపోతున్నయన్నారు. అక్రమంగా నడుపుతున్న వాటర్ ప్లాంట్ లు రద్దు చేయాలని, నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కార్పొరేషన్, గ్రౌండ్ వాటర్ డిపార్టుమెంట్, కలెక్టర్‌కు ఫిర్యాదుచేశామన్నారు. ధర్నాకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ప్లాంట్‌కు కార్పొరేషన్ అధికారులు తాళం వేసి సీజ్ చేశారని అన్నారు. అక్రమమని తాళం వేసినప్పుడు నిర్వాహకులను ఎందుకు అరెస్టు చేయలేదని నాయకులు ప్రశ్నించారు. వద్దకు వచ్చిన రెండవ పట్టణ సిఐ లక్ష్మణరావు వచ్చి మున్సిపల్ అధికారులు సీజ్ చేసిన ప్లాంట్‌ను తిరిగి ఓపెన్‌చేస్తే యజమానులపై క్రిమినల్ కేసులు పెడతామని తెలిపారు. దీంతో ధర్నాను విరమించారు. అంతకు ముందు ధర్నా కు వచ్చిన వారితో ప్లాంట్ యాజమాన్యానికి చెందిన వారు వాగ్వివాదానికి దిగారు. పోలీసులు వారిని అడ్డుకుని హెచ్చరించారు. ధర్నా లో ప్రజా సంఘాల నాయకులు టివి రమణ, పి.రమణమ్మ, ఎ.జగన్మోహన్, బి.రమణ, సుధీర్, కాలనీ వాసులు, మహిళలు పాల్గొన్నారు.



అయ్యప్పనగర్ వాటర్‌ప్లాంట్ వద్ద ధర్నా చేస్తున్న కాలనీవాసులు, ప్రజాసంఘాల నాయకులు

322 మంది జర్నలిస్టుల అక్రిడిటేషన్లకు ఆమోదం

ప్రజాశక్తి-విజయనగరం

2023-24 సంవత్సరానికి విజయనగరం జిల్లాలో పని చేస్తున్న 322 మంది జర్నలిస్టుల అక్రిడిటేషన్ల జారీకి జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి. ఎస్ అధ్యక్షతన మంగళవారం తన ఛాంబర్లో జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ సమావేశం జరిగింది. జీవో నెం.38లో పేర్కొన్న నిబంధనలు, జర్నలిస్టుల అర్హతా ప్రమాణాలు తదితర అంశాలపై చర్చ సాగింది. ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, ఇతర విభాగాల నుంచి జిల్లా వ్యాప్తంగా 385 మంది దరఖాస్తు చేసుకోగా జీవో నెం.38 నిబంధనల మేరకు అన్ని అర్హతలున్న 322 మందికి తొలి విడతలో అవకాశం కల్పిస్తూ కమిటీ అంగీకారం తెలిపింది. వారిలో పెద్ద, చిన్న తరహా పత్రికలు, పీరియాడికల్స్ నుంచి 165, ఎలక్ట్రానిక్ మీడియా నుంచి 122, ఫ్రీలాన్స్, వెటరన్, ఇతర విభాగాల 35 మంది జర్నలిస్టులు ఉన్నారు. చిన్న పత్రికలకు సంబంధించి రెవెన్యూ డివిజన్ ప్రాతిపదికన అదనంగా మరొక రెండు అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని, స్టేట్ బస్సు పాస్ ఉన్నవారికి ఎసి బస్సులో ప్రయాణించే అవకాశం కల్పించాలని కోరుతూ సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్‌కు కలెక్టర్ ద్వారా లేఖ రాయాల కమిటీ సభ్యులు సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. గణపతిరావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి డి. రమేశ్, గృహ నిర్మాణ శాఖ పీడీ రమణమూర్తి, ఆర్‌టిసి ఆర్.ఎం. అప్పలనారాయణ, మరో ఉన్నతాధికారి శ్రీనివాసరావు, ఆరోగ్య శ్రీ కో-ఆర్డినేటర్ అప్పలరాజు, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ శ్రీనివాసులు, ఎకమిటీ సభ్యులు ఎ.సూరిబాబు, కె. రమేష్ నాయుడు, ఎంఎంఎల్ నాయుడు, వి.వెంకట జగన్నాథరావు, కెజెశర్మ, బి.జోగారావు తదితరులు పాల్గొన్నారు.



సమస్యలపై ఆరా తీస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి

కాలువలు నిర్మించండి

కోలగట్లను కోరిన జొన్నగుడ్డి మహిళలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తమ కాలనీలో కాలువలు నిర్మించాలని డిప్యూటీస్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామిని జొన్నగుడ్డి మహిళలు కోరారు. 27వ డివిజన్లో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. మంగళవారం ఉదయం సూర్య నగర్, జొన్న గుడ్డి తదితర ప్రాంతాలలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు అమలు ఏ విధంగా ఉందో అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యల పైన ఆరా తీశారు. కాలువ సరిగా లేకపోవడంతో వర్షపు నీరు వీధుల్లోకి వస్తుందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో వెంటనే సంబంధిత అధికారులకు పిలిచి కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. స్థానిక కార్పొరేటర్ దుప్పాడ సునీత మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలన్నదే ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని అన్నారు. రానున్న ఎన్నికల్లో కోలగట్ల వీరభద్ర స్వామిని మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తారన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, డిఇ అప్పారావు, మాజీ కౌన్సిలర్ సూరిబాబు, దుప్పాడ అప్పారావు, పైడిరాజు పాల్గొన్నారు.

రహదారి పనులు ప్రారంభం

రాజీవ్ స్టేడియం నుండి క్యాటిల్ డిపో వరకు నూతనంగా ఏర్పాటు చేసిన రహదారిని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రారంభించారు. రూ.18 లక్షల వ్యయంతో నిర్మించిన రహదారిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు మాట్లాడుతూ నగరంలో అన్ని ప్రాంతాలలో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందన్నారు కార్పొరేటర్ ఆశపు సుజాత, నగరపాలక సంస్థ ఇఇ కె.శ్రీనివాసరావు, కోరాడ తాతారావు పాల్గొన్నారు

ఘనంగా వరల్డ్ పెస్ట్ అవేర్నెస్ డే

ప్రజాశక్తి-విజయనగరం

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం వరల్డ్ పెస్ట్ అవేర్నెస్ డే పై సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పెస్ట్ క్యూర్ సొల్యూషన్స్, డికెయస్ ప్యాలెట్స్ అండ్ ఫర్నీచర్ ప్రైవేట్ లిమిటెడ్ (విశాఖ) వ్యవస్థాపకులు, సిఎంఒ డి.ప్రకాశరావు మాట్లాడుతూ చెద నియంత్రణకు స్థిరమైన పరిష్కారాలు గురించి వివరించారు. చెద నియంత్రణ ప్రాముఖ్యత, పంటలకు, మానవులకు కీటకాల వల్ల కలిగే వివిధ సమస్యల గురించి వివరించారు. భవన నిర్మాణాల్లో నిర్మాణానికి ముందు, నిర్మాణం జరుగు తున్నప్పుడు, జరిగిన తర్వాత ఏ విధంగా చెదలు రాకుండా నివారించాలో వివరించారు. కార్యక్రమంలో సీతమ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి. రామమూర్తి, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జి. రవికిషోర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయనగరం రాయల్స్ జట్టు విజయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక చింతలవలస పివిజి రాజు క్రికెట్ మైదానంలో మంగళవారం జరిగిన ఎసిఎ ఉమెన్స్ టి-20 లీగ్ టోర్నమెంట్ లో విజయవాడ బ్లేజేర్స్‌తో జరిగిన మ్యాచ్ లో 6వికెట్ల తేడాతో విజయనగరం రాయల్స్ జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన విజయవాడ బ్లేజేర్స్ జట్టు 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 124 పరుగులు చేసింది. బ్లేజేర్స్ జట్టులో హేమ 23, ప్రసన్న 21 పరుగులు చేసి టాప్ స్కోరర్లుగా నిలిచారు. అనంతరం బ్యాటింగ్ చేసిన విజయనగరం రాయల్స్ జట్టు 19.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 125 పరుగులు సాధించి విజయాన్ని సొంతం చేసుకున్నారు. రాయల్స్ బ్యాటింగ్ లో పద్మజ 46 పరుగులు, హర్షిత్ 41 పరుగులు చేసి విజయంలో కీలక పాత్ర పోషించారు. ప్లేయర్ ఆఫ్ దమ్యాచ్ పద్మజకు దక్కింది.



ప్లేయర్‌ఆఫ్ ద మ్యాచ్ చెక్కును అందుకుంటున్న పద్మజ

ఆరోగ్య పరిరక్షణకే వైద్య పరీక్షలు : ఎస్‌పి

తిరుమల - మెడికవర్ ఆసుపత్రి సౌజన్యంతో పోలీసులకు ఆరోగ్య తనిఖీలు

ప్రజాశక్తి-విజయనగరం



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్నఎస్‌పి ఎం.దీపిక, డాక్టర్ తిరుమల ప్రసాద్ తదితరులు

జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లలో పని చేస్తున్న కింది స్థాయి ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు తిరుమల-మెడికవర్ ఆసుపత్రి సహకారంతో ఉచితంగా వైద్య పరీక్షలను జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా ఎస్‌పి ఎం.దీపిక ముఖ్య అతిథిగా హాజరై, ఉచిత వైద్య పరీక్షలను ప్రారంభించారు. జిల్లా పోలీసుశాఖలో పని చేస్తున్న ఉద్యోగులు సకాలంలో వైద్యపరీక్షలు చేయించుకోకపోవడం, ఆరోగ్య సమస్యలను గుర్తించకపోవడంతో అర్ధంతరంగా మృతి చెందడం, తీవ్ర అనారోగ్యానికి గురికావడం జరుగుతున్నాయన్నారు. ఇటీవల కాలంలో ఈ సమస్య మరింత తీవ్ర రూపందాల్చిన కారణంగా జిల్లా పోలీసుశాఖలో పని చేస్తున్న కొద్దిమంది ఉద్యోగులు చిన్న వయస్సులోనే మృత్యువాత పట్టారన్నారు. పోలీసు ఉద్యోగుల సంక్షేమాన్ని దష్టిలో పెట్టుకొని ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. సమస్యలను గుర్తించి, అవసరమైన చికిత్స అందించేందుకు చర్యలు చేపడుతున్నా మన్నారు. పోలీసు ఉద్యోగుల వైద్య పరీక్షల రిపోర్టులను కూడా డిజిటలైజ్ చేసి, భద్రపర్చి, ప్రతీ ఏడాది వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. తిరుమల - మెడికవర్ ఆసుపత్రి ఎమ్‌డి డాక్టర్ తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ - పోలీసులు ఉద్యోగంలో చేరినపుడు ఎంతో ఆరోగ్యంతో ఉంటారని, తరువాత కాలంలో ఉద్యోగంలో ఒత్తిడి, కాలాతీతంగా విధులు నిర్వహించడం వల్ల ఆరోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకొని, చికిత్స ప్రారంభిస్తే ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చునన్నారు. అనంతరం పలు వైద్య పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు అందించారు. సుమారు 2వేల మంది పోలీసు ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి (అడ్మిన్) అస్మా ఫర్హీన్, ఎస్‌సి, ఎస్‌టి సెల్ డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, తిరుమల-మెడికవర్ చీఫ్ కార్డియాలజిస్టు డాక్టర్ శరత్‌కుమార్ పాత్రో, సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్, ఐసియు స్పెషలిస్టు డాక్టర్ పిఎస్‌వి రామారావు, సెంటర్ హెడ్ పద్మ కుమార్, ఎఒ పివి నారాయణరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హోంగార్డుకు చేయూత

పోలీసుశాఖలో హోంగార్డుగా పని చేసి, ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన కుమారి సుంకరి ఎల్లమ్మకు హోంగార్డు ఒక్క రోజు అలవెన్స్ రూ. 3,20,920 చెక్ ను 'చేయూత'గా జిల్లా ఎస్‌పి ఎం.దీపిక, మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ఎఆర్ డిఎస్‌పి ఎల్.శేషాద్రి, ఆఫీసు పర్యవేక్షకులు ప్రభాకరరావు, పలువురు హోంగార్డులు పాల్గొన్నారు. రు పాల్గొన్నారు.

ఉపాధి హామీకి కేంద్రం తూట్లు

ప్రజాశక్తి- రాజాం

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచి, పథకాన్ని ఎత్తేయడానికి చేస్తున్న ప్రయత్నాలను ప్రతిఘటన, పోరాటాల ద్వారా తిప్పుకొట్టాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామమూర్తి నాయుడు వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఏ సత్యారావు పిలుపునిచ్చారు. మండలంలోని రాజయ్య పేట గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో మంగళవారం వారు మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో 2023 -24 సంవత్సరానికి రూ.60 వేల కోట్లు మాత్రమే కేటాయించి, 30శాతం తగ్గించి పథకానికి తూట్లు పొడిచారన్నారు. మరోపక్క మెటీరియల్ పనులు శాతం పెంచి కూలీలు పనులు శాతం తగ్గించారని, నిత్యవసర వస్తువులు ధరలు విపరీతంగా పెరిగిపోతున్నా రూ. 15 మాత్రమే కూలీ రేట్లు పెంచడం అన్యాయమన్నారు. గత 17 సంవత్సరాలుగా ఒక్క పూట పనిచేసి కూలీలకు ఇప్పుడు రెండు పూటల పనిచేయాలని నిబంధనలను పెట్టడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. పని చేసే చోట మంచినీరు, మజ్జిగ, పలుగు, పార, తట్ట, టెంట్లు, మెడికల్ కిట్లు ఇవ్వడం మానేశారన్నారు. పరికరాలు, సౌకర్యాలు లేకుండా పనిచేయగలరా? బుద్ధిఉన్న వారెవరైనా ఇలా చేస్తారా? దీనికితోడు వేసవి కాలంలో 20శాతం, నుండి 30శాతం వరకు వేసవి అలవెన్సులు క్రింద అదనంగా డబ్బులిచ్చేవారని ఇప్పుడు ఇవ్వడం లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు



పనులను అడ్డుకుని నిరసన తెలుపుతున్న రైతులు

నిర్వాసితులను ఆదుకోవాలని ధర్నా

ప్రజాశక్తి- మెంటాడ

ఆరు లైన్ల జాతీయ రహదారి, రింగ్ రోడ్డు నిర్మాణంలో రైతులకు ఎటువంటి నష్టపరిహారమూ చెల్లించకుండా పనులు చేపట్టడం ఏంటని రైతులు మంగళవారం మెంటాడ వద్ద జరుగుతున్న నిర్మాణ పనులను అడ్డగించారు. అనంతరం రహదారిపై ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా జెసిసి నాయకుడు కుమార్ మాట్లాడుతూ రైతులకు 30శాతం అదనంగా చెల్లిస్తామని ఆర్‌డిఒ చెప్పారన్నారు. ఆమె కూడా మోసపూరిత ప్రకటన చేయడం వెనుక రాజకీయం దాగివుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు నష్టపరిహారం తోపాటు పంట పొలాలకు రహదారి కల్పించి, రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

దేవుడి పేరుతో ఇసుక దోపిడీ

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని కొండగంగుబూడి పంచాయతీ పరిధిలో దేవుని ఆలయాలు నిర్మాణం పేరిట కొంత మంది ఇసుకాసురులు ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఆలయాల నిర్మాణానికి అని చెబుతున్నప్పటికీ వారు తీసుకెళుతున్న ఇసుకను మాత్రం క్షేత్రస్థాయిలో నిర్మాణాలు జరుగుతున్న ఆలయాల వద్ద వేయడం లేదని తెలిస్తోంది. సంబంధిత అధికారులు నిఘా పెట్టి ఇసుకాసురులను కఠినంగా శిక్షించాలని పలువురు కోరుతున్నారు.



ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న కావ్యశ్రీ

చిత్ర లేఖనంలో కావ్యశ్రీ పతిభ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కు నాయుడుపేట ఎపి ఆదర్శ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు జిల్లా స్థాయిలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీలో ప్రతిభ కనబరిచారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా జిల్లా విద్యాశాఖ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ధర్మవరంలో జిల్లాస్థాయి చిత్రలేఖనం పోటీలు నిర్వహించింది. ఈ పోటీలలో ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎస్ కావ్యశ్రీ ప్రథమ, డి చంద్రశేఖర్ తృతీయ స్థానం సాధించారు. జిల్లా స్థాయి చిత్ర లేఖన పోటీలో ప్రతిభ కనబర్చినందుకు పాఠశాల ప్రిన్సిపల్ రావాడ ఈశ్వరరావు, ఉపాధ్యాయులు వారికి అభినందనలు తెలిపారు.

చెరువు కబ్జాలపై సమగ్ర సర్వే చేయాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలో నాయుడు కాలనీ పక్కనే ఉన్న కోటి చెరువు భూములను కొంతమంది భూకబ్జాదారులు జిరాయితీ భూములుగా దొంగ డాక్యుమెంట్లు సృష్టించి చెరువును పూర్తిగా కనుమరుగు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆటువంటి వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు మంగళవారం తహశీల్దార్‌కు వినతి పత్రాన్నిచ్చారు. ఆయన మాట్లాడుతూ తక్షణమే సర్వే జరిపి కోటి చెరువు విస్తీర్ణం మొత్తాన్ని గుర్తించి ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని కోరారు. పట్టణంలో ఉన్న అమ్మి గారి కోనేరు గట్టు పైన అక్రమంగా నిర్మిస్తున్న ఇల్లు నిర్మాణాలను తక్షణమే ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ నాయకులు భోగి శ్రీనివాస్ పాల్గొన్నారు.



యువతకు కిట్లను అందిస్తున్న నాయకులు

యువతకు వాలీబాల్, క్రికెట్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - గజపతినగరం

మండలంలోని కెంగువ ఎస్‌సి కాలనీలో యువకుల కోరిక మేరకు వాలీబాల్, క్రికెట్ కిట్లను వైసిపి యువ నాయకులు లెంక గణేష్ ప్రోత్సాహంతో సర్పంచ్ కొండల సూర్యప్రభ ఆధ్వర్యంలో ఎంపిటిసి కొండల శ్రీను చేతుల మీదుగా అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం అందించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ క్రీడల వల్ల యువకులు శారీరకంగా, మానసికంగా దృఢపడతారన్నారు. గ్రామంలో యువతకు తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటూ, తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

అధిక ధరలు తగ్గించాలని 13న ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం కోట

పెరిగిన ధరలు తగ్గించాలని,పెంచిన పన్నులు భారాలను నిరసిస్తూ ఈనెల 13 న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని నవ యువ సమాఖ్య జిల్లా అధ్యక్షులు ఎం.అప్పలరాజు తెలిపారు. మంగళవారం వైయస్ఆర్ నగర్ ఆటో స్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ధర్నా గోడ పత్రికను ఆవిష్కరించారు. నేడు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి పోయాయన్నారు. మరో వైపు నగరంలో పన్నుల భారాలు, సర్‌ఛార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీల భారాలు వేసి ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు.పెరిగిన ధరలు తగ్గించాలని,పన్నులు,విద్యుత్ ఛార్జీలు భారాలు ను తగ్గించాలని కోరుతూ తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు సత్కారం

ప్రజాశక్తి - బొబ్బిలి

శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనుపమను మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, శానిటేషన్ సిబ్బంది మంగళవారం సాయంత్రం సత్కరించారు. బొబ్బిలి మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న అనుపమకు తెనాలి బదిలీ అయింది. దీంతో ఆమె సేవలను కొనియాడి సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



అనుపమను సత్కరిస్తున్న చైర్మన్

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నివాసయోగ్యానికి అనుకూలంగా ఉండే విధంగా గృహ సముదాయాల వద్ద తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేయాలని టిడ్కో అధికారులకు హౌసింగ్ కమిటీ సూచించింది. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో టిడ్కో, నగరపాలక సంస్థ అధికారులతో హౌసింగ్ కమిటీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించింది. హౌసింగ్ కమిటీ సభ్యులు మరియు ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్ మాట్లాడుతూ నగరంలో సారిపల్లి, సోనియా నగర్ ప్రాంతాలలో టిడ్కో ఇళ్ల నిర్మాణాల వద్ద ఎదురవుతున్న క్షేత్రస్థాయి ఇబ్బందులను అధికారులకు అడిగి తెలుసుకున్నారు. ఆయా సముదాయాల వద్ద ప్రస్తుతం నెలకొన్న సమస్యల పైన వివరిస్తూ వాటి పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా సారిపల్లి ప్రాంతంలో ఇప్పటికే అనేకమంది గృహ లబ్ధిదారులకు ఇళ్లను మంజూరు చేసి అక్కడ నివాసం ఉండే విధంగా ఏర్పాట్లు చేశారు. తాగునీటికి నెలకొన్న ఇబ్బందులపై రాజేష్ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన అధికారులు నీటి పంపిణీకి అడ్డంకులు లేవని, అన్ని రకాలుగా చేస్తామని చెప్పారు. నిత్యవసర సరుకులను అందుబాటులోకి తెచ్చేందుకు అవకాశం ఇవ్వాలని సూచించారు. సోనియా నగర్ లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని తెలిపారు. హౌసింగ్ కమిటీ సభ్యులు మరియు కార్పొరేటర్ తవిటిరాజు, మారోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నివాసయోగ్యానికి అనుకూలంగా లేని విధంగా ఇళ్లను మంజూరు చేసి లబ్ధిదారులకు ఇబ్బందులు పాలు చేశారని అన్నారు. ప్రస్తుతం లబ్ధిదారులు కొంతమంది ఆయా ప్రాంతంలో నివసిస్తున్నారన్నారు. వారికి అవసరమైన సదుపాయాలను కల్పిస్తూనే సోనియా నగర్ వద్ద మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు చొరవ చూపాలని అన్నారు. టిడ్కో ఇఇ ఎస్.జ్యోతి మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల సముదాయాల వద్ద అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, హౌసింగ్ కమిటీ సభ్యులు గాదం మురళి, టిడ్కో ఏఇలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్

చిరుధాన్యాల సాగుతో అధిక లాభాలు

ప్రజాశక్తి - గజపతినగరం

చిరుధాన్యాల సాగుతూ అధిక లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి సిహెచ్ ధనలక్ష్మి అన్నారు. మంగళవారం పాతబగ్గం, కొత్తబగ్గం, కొనిస, మరుపల్లి, లోగిస, కాలంరాజుపేట, ముచ్చర్ల ఆర్‌బికెల్లో రైతులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె చిరుధాన్యాలను సాగు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న మెట్ట ప్రాంతాలు చిరుధాన్యాలకు అనుకూలమని, ఎకరం పండించే నీటితో నాలుగు ఎకరాలు చిరుధాన్యాలు పండించవచ్చునని చెప్పారు. అవసరం మేరకు యూరియా, డిఎపిలను అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి రైతు సిసిఆర్‌సి కార్డు కలిగి ఉండాలన్నారు. 50శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు ఇస్తున్నామని చెప్పారు. అనంతరం రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, విఎఎలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

బొబ్బిలి: రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అన్నారు. మంగళవారం గొల్లపల్లి రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు పచ్చిరొట్ట, వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి వైసిపి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రైతులు వద్దకే ఎరువులు, విత్తనాలు సరఫరా చేసేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రైతులకు పంట పెట్టుబడి కోసమే ప్రభుత్వం రైతు భరోసా అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు తెర్లి సత్యారావు, వ్యవసాయ సహాయకులు పుణ్యవతి, రైతులు పాల్గొన్నారు.



బొబ్బిలి: రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్

పూతిక పేటలో గడప గడపకు..

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని పూతికపేటలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్‌బాబు ప్రతీ గడపకు వెళ్లి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ద్వారా ప్రతీ కుటుంబం పొందిన సంక్షేమాన్ని వివరించారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ళ సుధారాణి, జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ళ శ్రీరాములు నాయుడు, డీసీసీబీ వైస్ చైర్మన్ చనుమల్ల వెంకట రమణ, వైస్ ఎంపిపిలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం నాయుడు, మొయిద ఎంపిటిసి పెనుమత్స సంతోష్ బాబు, స్థానిక సర్పంచ్ గోవింద, నాయకులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

జెఎల్‌ఎం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విద్యుత్ షాక్‌తో మృతి చెందిన జూనియర్ లైన్ మేన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జరజాపుపేట గ్రామ నాయకులు కోరారు. మంగళవారం నగర పంచాయతి వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు ఆధ్వర్యంలో గ్రామ నాయకులు విద్యుత్ శాఖ ఎస్ఇకి వినతి పత్రం అందించారు. మృతి చెందిన మద్దిల శివ కిషోర్ కుటుంబంలోకి ఒకిరికి ప్రభుత్వం కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇచ్చి ఆర్థిక పరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు మాట్లాడుతూ చిన బూరాడ పేటలో జెఎల్‌ఎంగా పని చేసిన మద్దిల శివ విధులు నిర్వర్తిస్తుండగా గత నెల 5న విద్యుత్ షాక్ తగిలి మృతి చెందారన్నారు. శివ అకాల మరణంతో తన కుటుంబం దిక్కు లేనిదయిందని ఆ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకొని కారుణ్య నియామకం కింద కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆర్థిక సదుపాయాలు కల్పనకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. వినతినిచ్చిన వారిలో నాయకులు కింతాడ కళావతి, మద్దిల వాసు, పోలుబోతునారాయణ మూర్తి, ఎంఎం నాయుడు, నల్లి శ్రీను, తుమ్ము నారాయణ మూర్తి, మద్దిల రాజా రావు, తుమ్ము వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఇకి వినతినిస్తున్న జరజాపుపేట గ్రామ నాయకులు

జెవికె కిట్లను పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పాఠశాలల పున్నప్రారంభ సమయానికి జగనన్న విద్యా కానుక కిట్లను పాఠశాలలకు పంపిణీ చేయాలని ఎంపిడిఒ జి. గిరిబాల అన్నారు. మండలంలో సతివాడ వద్ద ఆదర్శ పాఠశాలలో ఉన్న జెవికె కిట్లను ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న విద్యా సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే జెవికె కిట్లను మండలానికి పంపిణీ చేసిందన్నారు. ఇప్పుడు వాటిని పాఠశాలలలో చదివే ఒక్కో విద్యార్థికి అందించెందుకు సిద్ధం చేస్తున్నామన్నారు. అనంతరం పాఠశాలలో ఎంఆర్‌సి సిబ్బంది, సిఆర్‌పిలు, పిటిఐ కిట్లను సర్దుబాటు చేసే విధానాన్ని ఆమె పరిశీలించారు. యూనిఫామ్స్, బెల్ట్స్, నోట్ బుక్స్, షూలను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి అంబళ్ల కృష్ణారావు, ఎంఆర్‌సి సిబ్బంది, సిఆర్‌సిలు, పిటిఐలు పాల్గొన్నారు.



జెవికె కిట్లను పరిశీలిస్తున్న ఎంపిడిఒ గిరిబాల



ర్యాలీ చేస్తున్న సిహెచ్‌సి సిబ్బంది, వైద్యులు

మలేరియాపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - కొత్తవలస

మలేరియా జ్వరాలపై ప్రజల అప్రమత్తంగా ఉండాలని వియ్యంపేట పిహెచ్‌సి వైద్యాధికారి గోపాలకృష్ణ అన్నారు. వియ్యంపేటలో మంగళవారం ఆశ వర్కర్స్ మలేరియాపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ నుండి అక్టోబర్ వరకు వర్షా కాలంలో దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులు వస్తాయని తెలిపారు. ఇంటి ముందు నీరు నిల్వ ఉండకుండా దోమలు పుట్ట కుండా, కుట్ట కుండా చూడాలని తెలిపారు. వీధుల్లో, ఇంటి పరిసరాలలో కొబ్బరి బొండాలు, టైర్లు, లేకుండా చూడాలని, ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలని తెలిపారు. అనంతరం పలు నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌ఎన్ జగదాంబ, ఎంపిహెచ్ఇఒ వి. నరసింహారావు, వి.పద్మావ, హెచ్ఎస్ ఈశ్వరావు, ల్యాబ్ టెక్నీషియన్ సంతోష్, హెల్త్ అసిస్టెంట్స్ సత్యారావు, ఈశ్వరరావు, ఏఎన్ఎమ్స్, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

టిడిపి ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని వల్లంపూడిలో మంగళవారం టిడిపి నాయకులు గోగాడ సత్యం, రుద్ర అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల రాంప్రసాద్ మాట్లాడుతూ వైఎస్ఆర్ ప్రభుత్వం అధికారంలోకి మరలా వస్తే మన ఆస్తులతో పాటు, మన కుటుంబాలు కూడా సర్వనాశనం అయిపోవడం ఖాయమన్నారు. గ్రామాలలో టిడిపి కార్యకర్తలందరూ సైనికుల్లా పనిచేసి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయాలన్నారు. ఈ సమావేశంలో టిడిపి మండల ఉపాధ్యక్షుడు పోతల రమణ, ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బుచ్చిరాంప్రసాద్

కార్యదర్శుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

పంచాయతి కార్యదర్శుల సమస్యలు పరిష్క రించాలని పంచాయతి కార్యదర్శుల సంఘం నాయకులు కోరారు. మంగళ వారం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస్ రావు, జిల్లా పంచాయతి అధికారి ఎల్.ఎన్.వీ. శ్రీధర్ రాజాని జిల్లా పరిషత్తులో కలిసి పంచాయతి కార్యదర్శులు బదిలీలు పారదర్శకంగా, అవినీతి లేకుండా జరిపినందుకు ధన్యవాదాలు తెలిపారు. గ్రేడ్ -6 నుంచి గ్రేడ్ -3 వరకు పదోన్నతులు కల్పించాలని కోరారు. 6 సంవత్సరాలైన ఇంకా 60 మందికి ప్రొబిషన్ డిక్లర్ కాలేదని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. పై సమస్యలకు వారు సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు సంఘ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శులు సంఘం ప్రతినిధులు యర్ర రమణ, లెంక తౌడు, సి. హెచ్. అప్పలనాయుడు, కె. భాస్కర్‌రావు, కె. బంగారు రాజు, జి. సంతోష్, జి. యశోద, ఎస్. లక్ష్మి, వీ. కిరణ్ కుమార్, కె. రాంజీ రావు, వాసంతి ఎమ్. జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలను జెడ్‌పి చైర్మన్‌కు వివరిస్తున్న కార్యదర్శులు

ప్రభుత్వ భూముల కబ్జా

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కేజీ పూడి రెవెన్యూ పరిధిలో గల అటవీ శాఖ భూములు, సర్వే నంబర్ 136 ఎస్ కోట సీతారాంపురం రెవెన్యూ పరిధిలోగల ప్రభుత్వ భూములను కొంత మంది కబ్జాకు పాల్పడుతున్నారు. మరి కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు లీజు పేరుతో జెసిపితో చదును చేస్తూ తనకు నచ్చిన విధంగా జిరాయితీ భూమికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూములను, అటవీ శాఖ భూములను ఆక్రమించుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణపై స్థానిక విఆర్ఒని వివరణ కోరగా ఇంఛార్జి తహశీల్దార్ దృష్టికి తీసుకుని వెళ్ళామని చెబుతున్నారు. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమి

భూకబ్జాలు అరికట్టాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతిలో భూకబ్జాలు అరికట్టాలని బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బూర్లే శ్రీధర్ డిమాండ్ చేశారు. మంగళ వారం స్థానిక చంద్రబాబు నాయుడు కాలనీలో 6 సంవత్సరాల క్రితం నిర్మించిన ఆంజనేయ స్వామి గుడి వున్న స్థలాన్ని కబ్జా చేస్తున్న అధికార పార్టీకి చెందిన బంగార్రాజు కుటుంబం ఇకపై అక్కడ పూజలు చేయకూడదంటూ పోలీసులు ద్వారా వేధింపులు జరుపుతున్నారని భాదితులు తన వద్ద గోడు వెళ్లబోసుకున్నారని శ్రీధర్ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగర పంచాయతిలో జరుగుతున్న భూకబ్జాలు అధికార్లు అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, బాధితుల పాల్గొన్నారు.

బోరుబావి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - కొత్తవలస

కొత్తవలస మేనేజర్ పంచాయతీ పరిధిలో గల చీపురువలస జగనన్న లేఔట్‌లో గ్రామ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి బోరుబావి పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కృషితో జగనన్న కాలనీలో మంచినీటి సమస్య లేకుండా కృషి చేస్తున్నానని అన్నారు. తమ పరిధిలో గల గ్రామాలన్నింటిలోనూ మంచినీటి ఎద్దడి లేకుండా కృషి చేస్తున్నామని చెప్పారు. మేజర్ పంచాయతీ పరిధిలో మంచినీటి కొరత తీర్చడానికి లక్షాధి రూపాయలు ఖర్చు చేస్తున్నట్టు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



బోరుబావి పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ రామస్వామి

ఈ ఏడాది జిల్లాలో జాతీయ వెదురుమిషన్

ప్రజాశక్తి- బొబ్బిలి

జిల్లాలో ఈ ఏడాది కొత్తగా జాతీయ వెదురు మిషన్ పథకాన్ని అమలు చేస్తున్నామని, ఇందులో భాగంగా వెదురు మొక్కలు నాటే రైతులకు ప్రోత్సహకాలు అందజేస్తున్నామని జిల్లా ఉద్యానవనశాఖ ఎడి కె. శైలజ తెలిపారు. స్థానిక ఉద్యానవన క్షేత్ర కార్యాలయంలో మంగళవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. సుమారు 50 హెక్టార్ల లక్ష్యంగా రూ.240 విలువ చేసే ఒక్కో వెదురు మొక్కను 50శాతం సబ్సిడీపై రైతులకు అందజేస్తామన్నారు. మొదటి సంవత్సరం రూ.60, ఆ తరువాత రెండేళ్లలో రూ.40 చొప్పున రైతులకు ఇస్తామన్నారు. ఆరేళ్లకు ఏపుగా పెరిగే బీమాజాతి వెదురు మొక్కలను ప్రభుత్వమే సరఫరా చేస్తుందన్నారు. సపోటా తోటల పెంపకానికి హెక్టారుకు మొదటి ఏడాది రూ.10,286 రెండు, మూడో సంవత్సరాల్లో రూ.3,200 చొప్పున రైతులకు ప్రోత్సహకాలు అందిస్తామన్నారు. హైబ్రిడ్ వెజిటబుల్ కల్టివేషన్ పథకం కింద వంద హెక్టార్లలో 40 శాతం రాయితీని కూరగాయల రైతులకు మొత్తం పంట సీజన్‌లో అందిస్తామన్నారు. గతంలో మాదిరిగా విత్తనాలు కొనుగోలు రశీదులపై రైతులు రాయితీలు ఇచ్చే విధానాన్ని రద్దు చేశామన్నారు. గతేడాది సుమారు 5వేల మంది రైతులకు ఉద్యానవన పంటల సాగు ప్రోత్సహకంగా రూ.430కోట్లు రాయితీలను అందించామన్నారు. అనంతరం బొబ్బిలి ఉద్యానవన శిక్షణా కేంద్రంలో నాలుగు మండలాల ఆర్‌బికె ఉద్యోగులకు శాఖా పరంగా అమలు చేస్తున్న పలు పథకాలపై అవగాహన కల్పించారు..



మాట్లాడుతున్న ఎడి శైలజ

అంగరంగ వైభవంగా సిరిమానోత్సవం

ప్రజాశక్తి - రామభద్రపురం

మండలంలోని తారాపురం వెలసిన చింతాలమ్మ, కొత్తమ్మ, బంగారమ్మ, తారాదేవిల సిరిమానోత్సవ పండుగ మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్త జనంతో గ్రామం కిక్కిరిసింది. ఘటాలు, సిరిమాను, వివిధ వేష దారులు సంయుక్తంగా గ్రామం అంతా తిరువీధి తిరిగాయి. ఎండలు అధికంగా ఉండి వడగాలులు వీచినా ప్రజలు తండోప తండులుగా ఉత్సవంలో పాల్గొన్నారు. ఎంపి బెల్లాన చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, మాజీ ఎంపి బొత్స ఝాన్సీ, ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, మాజీ మంత్రి సుజయ్ కృష్ణరంగారావు, నియోజక వర్గ ఇంచార్జి బేబీ నాయన హాజరై సిరిమానును దర్శించుకున్నారు. డిఎస్‌పి శ్రీధర్ పర్యవేక్షణలో సీఐ తిరుమల రావు, ఎస్ఐ సురేంద్ర నాయుడు ఆధ్వర్యాన బొబ్బిలి సర్కిల్ సిబ్బంది పటిష్ట బందోబస్తు నిర్వహించారు.



సిరిమానును అధిరోహించిన పూజారి